నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 | HYDERABAD




ఖైరతాబాద్ గణనాథుడిని దర్శించుకొని మాట్లాడుతున్న నగర సీపీ సీవీ ఆనంద్




**కొండాపూర్‌లో** ఉన్న రంగారెడ్డి జిల్లా దవాఖానలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు.. నాలుగు నెలలుగా జీతాలివ్వలేరని మంగళవారం దవాఖాన ఆవరణలో నిరసన చేపట్టారు. అనంతరం సీపీఐ శేరిలింగంపల్లి కార్యదర్శి టీ. రామకృష్ణ, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందు యాదవ్‌లతో కలిసి కార్మికులు దవాఖాన సూపరింటెండెంట్ అనురాగిణి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. *–కొండాపూర్, సెప్టెంబర్ 10*

## జీవో 58,59పై అయోమయం

**క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తి..**

**ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు**

మేడ్చల్, సెప్టెంబర్10 (నమస్తే తెలంగాణ): జీవో 58,59 దరఖాస్తుల పరిశీలన పూర్తయిన ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. నివాస స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 26,092 దరఖాస్తులు, జీవో 59 కింద 15,200 దరఖాస్తులు మొత్త 41,292 వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను 41 బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పూర్తి చేశారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయినా ప్రభుత్వ నిర్ణయం కోసం దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. జీవో 58,59 క్రమబద్ధీకరణపై ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే కొన్ని రోజుల కింద ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తెరపైకి తీసుకొచ్చింది. గతంలో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో జిల్లా అధికార యంత్రాంగం వేగంగా పనిచేస్తున్న క్రమంలో జీవో 58, 59 దరఖాస్తుల పరిస్థితి ఏమిటని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గణనాథుడి కృపతోనే రెండోసారి సీపీ

**ఖైరతాబాద్ వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేసిన సీపీ సీవీ ఆనంద్**

**గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగల బందోబస్తుపై సమీక్ష**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సీపీగా మళ్లీ వస్తానని అనుకోలేదని, ఆ గణనాథుడి అనుగ్రహంతోనే తిరిగి హైదరాబాద్ సీపీగా వచ్చానని.. గణేశ్ చతుర్థి రోజు హైదరాబాద్ సీపీగా నియామకం జరగడం సంతోషగా ఉందని సీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. మంగళవారం గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగులకు సంబంధించిన బందోబస్తుపై సెంట్రల్ జోన్, సౌత్‌జోన్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు ఆయన ఖైరతాబాద్‌లోని బడా గణేశుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను సెంట్రల్ జోన్ డీసీపీగా ఉన్నప్పటి నుంచి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సుదర్శన్, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణంలో పడుగ పూర్తి చేశారని తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ వద్ద ఇబ్బందులు లేకుండా రద్దీని బట్టి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ప్రధాన అంశం 70 అడుగుల గణేశ్ నిమజ్జనం అని, అందులో ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం చూడటానికి లక్షలాది మంది తరలి వస్తారని చెప్పారు. గత సంవత్సరం లాగానే మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని నిర్వాహకులను కోరారు. ఒక భక్తునిగా, ఒక హైదరాబాదీగా ఇక్కడకు నన్ను ఆ వినాయకుడే రప్పించాడని సీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు నిమజ్జనం రోజు సుమారు 40 గంటల వరకు బందోబస్తులో ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. నగరంలో కీలకమైన జోన్లు సెంట్రల్ జోన్, సౌత్‌జోన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులతో బందోబస్తు గూర్చి చర్చించారు. గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగలకు బందోబస్తు ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఆయా డీసీపీలు ఇతర అధికారులకు సీపీ దిశా నిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## రామకృష్ణ మఠం సేవలు ఎనలేనివి

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : యువత వ్యక్తిత్వ వికాసానికి రామకృష్ణ మఠం అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక జ్యోతి వెలిగించేందుకు రామకృష్ణ మఠం దశాబ్దాలుగా చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రామకృష్ణ మఠంలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ రజతోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ హాజరై మాట్లాడారు. 1893 సెప్టెంబర్ 11న చికాగో విశ్వ వేదిక సాక్షిగా స్వామి వివేకానంద హిందూ ధర్మం గొప్పతనాన్ని చాటి చెప్పారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద అడుగు జాడల్లో నడవాలని సూచించారు.

అనంతరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ.. 25 ఏండ్ల క్రితం సెప్టెంబర్ 11న రామకృష్ణ మఠంలో మిషన్ జాతీయ సర్వాధ్యక్షుడు స్వామి రంగనాథానంద వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ విభాగాన్ని ప్రారంభించారని చెప్పారు.

ఇప్పటి వరకు 20లక్షల మందికిపైగా యువతకు వ్యక్తిత్వ వికాసం, యోగ, ధ్యానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్, మఠం జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి సుహితానంద, డాక్స్ టెరిటీ గ్లోబల్ వ్యవస్థాపకుడు శరద్ సాగర్, వీఐహెచ్ఈ ఫ్యాకల్టీ సభ్యులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




## విజిలెన్స్ ఉనికి ప్రశ్నార్థకం!

**నిర్వీర్యం దిశగా జీహెచ్ఎంసీ అడుగులు**

**హైడ్రా నుంచి రిలీవ్ కానీ పోలీస్ అధికారులు**

**జీతం ఒక చోట.. పని మరో చోట చేయడంపై ఉద్యోగుల్లో చర్చ**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో కీలకమైన విజిలెన్స్ విభాగం ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. సంస్థకు సంబంధించి వివిధ అభివృద్ధి పనుల్లో అవినీతి, అక్రమాలు, అధికారులపై వచ్చిన ఆరోపణలపై అంతర్గతంగా విచారణ జరిపి కమిషనర్‌కు నివేదిక అందించాల్సిన విజిలెన్స్ విభాగాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ ఇప్పుడు సంస్థలో మొదలైంది. దీనికి హైడ్రా ఆజ్యం పోసిందని హాట్ హాట్ చర్చ జరుగుతున్నది. హైడ్రా ఏర్పాటుతో అప్పటి వరకు ఉన్న ఈవీడీఎంలోని విజిలెన్స్ విభాగాన్ని బల్దియాకు బదిలీ చేసింది. అయితే ఈ సమయంలో విజిలెన్స్‌కు సంబంధించిన కానిస్టేబుళ్లు, ఎస్ఐ, సీఐ, ఏసీపీలు బల్దియాకి రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కానీ దాదాపు నెల రోజులు దాటినా ఇప్పటి వరకు అదనపు కమిషనర్ విజిలెన్స్‌కు రిపోర్టు చేయలేదు. దీంతో హైడ్రా ఆఫీసులోనే ఉద్యోగాలు చేస్తున్నారు. జీతం మాత్రం బల్దియాలో తీసుకుంటూ హైడ్రా కార్యాలయంలో ఎలా పనిచేస్తారంటూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజిలెన్స్ విభాగానికి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అడ్మిన్ విభాగం అదనపు కమిషనర్ నళిని పద్మావతి హైడ్రాలో పనిచేస్తున్న విజిలెన్స్ స్టాఫ్‌ను వెంటనే రిలీవ్ చేయాలని హైడ్రా కమిషనర్‌కు లేఖ రాసినా ఫలితం లేదు. హైడ్రాకు సైబరాబాద్ కమిషనరేట్ నుంచి 22 మంది పోలీస్ అధికారులను నియమించారు. వీరి రాకతోనైనా విజిలెన్స్ విభాగానికి రావాల్సిన ఉద్యోగులు రిలీవ్ చేస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే..!!

## బయట తింటే అంతే..

**డర్టీ కిచెన్**

*ఆహార ప్రియులు.. బయట తినాలంటే జర ఆలోచించాలి. ఎందుకంటే నాణ్యత లేని ఆహారం ఓ కారణమైతే.. దానికి తోడు పలు రెస్టారెంట్స్, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంట గదులు అపరిశుభ్రంగా ఉండటం, గడువు ముగిసిన ముడి సరుకులను వంటల్లో వాడటం కూడా ఇందుకు కారణం. గడువు ముగిసిన ముడి సరుకులతో వండివార్చిన నోరూరించే రకరకాల ఆహార పదార్థాలను తింటే అనారోగ్యానికి బలైనట్లే. అందుకే బయట ఆహారం తినేటప్పుడు కాస్త ఆలోచించాలి ఆహార ప్రియులు. ఓ పక్క ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు నాణ్యతాప్రమాణాలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటున్నా.. కానీ, నిర్వాహకుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనబడటం లేదు.*





### ఆహారంలో బొద్దింకలు.. కుళ్లిన టమాటాలతో చట్నీ


**ఆహార ప్రియులకు దడ పుట్టిస్తున్న టిఫిన్ సెంటర్లు**

**ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సామాన్యంగా బొద్దింకలను చూస్తేనే ఒళ్లు ఝల్లుమంటుంది.. అలాంటిది ఆహారంలో కనిపిస్తే..ఆ భోజనం తినగలమా? ఈ మధ్యకాలంలో మనకు ఎక్కువగా వినిపిస్తున్న వార్త తినే ఆహారం (టిఫిన్)లో బొద్దింక దర్శనమివ్వడం. గత నెల 23న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వరంగల్ హైవే మెయిన్‌రోడ్డు ఫిల్లర్ నంబర్106 వద్ద ఉన్న శ్రీ రాఘవేంద్ర హోటల్‌లో ఓ కస్టమర్ తినే దోసెలో మాడిపోయిన బొద్దింక వచ్చింది. బొద్దింకను చూసి కస్టమర్ ఖంగుతిన్నాడు. సదరు కస్టమర్ ఎక్స్ వేదికగా బొద్దింకతో కూడిన దోసెను పోస్టు చేయడం వైరల్ అయింది. తాజాగా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు మంగళవారం నగరంలోని అశోక్‌నగర్‌లోని పలు టిఫిన్ సెంటర్లు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించగా వంటగదుల్లో బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. బయట తినాలంటే ఆహార ప్రియులు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ వైపు ఫుడ్‌సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్స్‌పై చర్యలు తీసుకుంటున్నా.. నిర్వాహకుల్లో మాత్రం మార్పు కనబడటం లేదు.

**అశోక్‌నగర్‌లోనూ..**

అశోక్‌నగర్‌లోని పలు హాస్టళ్లు, టిఫిన్స్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు విస్తృత సోదాలు చేశారు. చేతన్ పీజీ బాయ్స్ హాస్టల్‌లో వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో పాటు పెద్ద మొత్తంలో బొద్దింకలు ఉన్నట్లు గుర్తించారు. డస్ట్‌బిన్‌లకు మూతలు లేకుండా తెరిచి ఉన్నాయి. అందులో పనిచేసే వారికి హెయిర్ క్యాప్స్, ఫుడ్ హ్యాండర్లు లేకుండా ఉన్నారు. దీంతో పాటు బాలాజీ దర్శన్‌లో రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన ఫుడ్‌కు లేబుల్ లేకుండా ఉన్నాయని, వంటగదిలో పిండిగిర్ని (గ్రైండర్) ప్రాంతం అపరిశుభ్రంగా ఉందని, అక్కడ పచ్చిమిర్చి లాంటి వస్తువులు నిల్వ చేశారని గుర్తించారు. వాష్‌రూం అపరిశుభ్రంగా ఉందని, వంటగది రూం పైకప్పు నుంచి వాటర్ లీకేజీలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అశోక్‌నగర్ పద్మావతి టిఫిన్స్, శ్రీ సిద్ధి వినాయక ఉడిపి హోటల్ స్టోర్ రూంలో టమోటాలు పాడైనట్లు గుర్తించారు. ఆ టమోటాలతోనే చట్నీ చేస్తున్నట్లు, అదే చట్నీని కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. సిద్ధం చేసిన ఆహార వస్తువులకు లేబుల్ లేకపోవడం, వంటగది ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, వర్కర్లు హెయిర్‌క్యాప్స్ ధరించలేదని నిర్ధారించారు. మై హోం లగ్జరీ గర్ల్స్ హాస్టల్‌లో ఫ్రిజ్‌లో ఉన్న ఆహార వస్తువులకు లేబుల్స్ సరిగా లేవని, సింథటిక్ ఆహార రంగుల వినియోగం, వంటగదిలో బొద్దింకలు తిరుగుతున్నట్లు గుర్తించారు.



**ఫుడ్ సేఫ్టీ దాడుల్లో విస్తుపోయే నిజాలు..!!**

కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు దాకా నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నిబంధనలు పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు. వంటగదులు పరిశుభ్రత పాటించడం లేదు..ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మసాలాలు దట్టించి మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు..ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచుగా జీహెచ్ఎంసీకి నిత్యం 100కు వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు కల్తీరాయుళ్ల భరతం పడుతున్నా... కొందరి నిర్వాహకుల్లో మార్పు కనబడకపోవడం గమనార్హం. అయితే ఆహార నాణ్యతాప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 040- 2111 1111 ను సంప్రదించాలని జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

## రిటైర్డ్ తప్పులు.. రెగ్యులర్ తిప్పలు


**డిప్యుటేషన్ ఉద్యోగుల చేతుల్లో హెచ్ఎండీఏ విలవిల**

**వారి హయాంలోనే అక్రమ నిర్మాణాల అనుమతులు**

**నోటీసులిచ్చిన హైడ్రా..**

**రెగ్యులర్ ఉద్యోగుల్లో ఆందోళన**

*రిటైర్డ్, డిప్యుటేషన్ ఉద్యోగుల చేతుల్లో హెచ్ఎండీఏ అల్లాడిపోతుంది. వారు చేసే తప్పులు రెగ్యులర్ ఉద్యోగుల పాలిట శాపంగా మారుతోంది. ముఖ్యంగా అనుమతుల ప్రక్రియ, ఎన్ఓసీ, ఆదాయం సమకూర్చడంలో కీలకమైన అన్ని విభాగాల్లో రిటైర్డ్, డిప్యుటేషన్ ఉద్యోగులే పైచేయిగా నిలవడంతో.. వారు చేసే తప్పిదాలు రెగ్యులర్ ఉద్యోగుల మెడకు చుట్టుకుంటున్నాయని వాపోతున్నారు.*




సిటీబ్యూరో, సెప్టెంబర్ 10(నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగుల నియామకం లేకపోవడంతో కొంత కాలంగా డిప్యుటేషన్, రిటైర్డ్ ఉద్యోగుల హవా నడుస్తోంది. ముఖ్యంగా ప్లానింగ్, ఇంజినీరింగ్‌తో పాటు, ఇతర అర్బన్ ఫారెస్ట్రీ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోంది. హెచ్ఎండీఏకు ఆదాయం తీసుకువచ్చే ప్లానింగ్, ఎస్టేట్, అర్బన్ ఫారెస్ట్రీ ప్రధాన విభాగాల్లో రిటైర్డ్, డిప్యుటేషన్ ప్రాతిపదికన చేరి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అనుమతులు, ఎన్ఓసీల విషయంలో చేతివాటం ప్రదర్శించిన సందర్భాల్లో హెచ్ఎండీఏ కీలుబొమ్మలా మారింది. దీంతో అధికారులు ఇచ్చే అనుమతుల వెనుక డిప్యుటేషన్, రిటైర్డ్ ఉద్యోగుల ప్రలోభాలు కూడా ఉండటంతో అసలు విషయం వెలుగులోకి రాకుండా కప్పిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ప్లానింగ్ నిర్వీర్యం..**

హెచ్ఎండీఏకు ఆదాయం సమకూర్చడంలో ప్లానింగ్ విభాగం అత్యంత కీలకపాత్రను పోషిస్తోంది. ఈ క్రమంలో వీరిచ్చే అనుమతులు, భవన నిర్మాణ ఎన్ఓసీలతోపాటు, ఓసీ వంటి ఇతర కార్యకలాపాలు అన్ని కూడా వీరి ఆధీనంలో సాగుతాయి. అయితే వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆఫీసు బయటకు రాకపోవడంతో కన్సల్టెన్సీల మాటున గుట్టుగా వ్యవహారాలు చెక్కబెట్టేస్తున్నారు. దీంతోనే ప్లానింగ్ విభాగం ఇచ్చే ఎన్నో అనుమతుల్లో కూడా తప్పులు జరుగుతున్నట్లు తేలింది. ఇక అన్ని విభాగాల్లో తిష్ట వేసిన డిప్యుటేషన్ అధికారుల ఆగడాలతో మాతృ సంస్థకు చెందిన ఉద్యోగులు పలు వివాదాల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని, కనీసం వారిపై చర్యలు తీసుకునే వీల్లేకపోవడంతో ఆడింది ఆటగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. డిప్యుటేషన్, రిటైర్డ్ ఉద్యోగుల అరాచకంతో హెచ్ఎండీఏను అప్రతిష్ట పాలు చేయడంతోపాటు, ఆదాయాన్ని కోల్పోయేలా చేస్తుందనే విమర్శలున్నాయి. ఎస్టేట్ విభాగంలో పనిచేస్తున్న కొంతమంది సంస్థకు రావాల్సిన అదాయ వ్యవహారాలను చక్కబెట్టాల్సింది పోయి... బయటి వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**హైడ్రా నోటీసులతో ఝలక్..**

తాజాగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన కొంత మంది హెచ్ఎండీఏ అధికారులు ఇప్పటికే పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో డీటీసీపీ, జీహెచ్ఎంసీ నుంచి వచ్చిన కొందరు ఉద్యోగులు వీటిని సొమ్ము చేసుకొని అనుమతులిచ్చిన ఘటనలు ఉన్నాయి. దీంతో ఇటీవల హైడ్రా కూల్చివేతలతో విషయం వెలుగులోకి రావడంతో రెగ్యులర్ ఉద్యోగుల మెడకు ఎక్కడ ఈ వివాదం చుట్టు కుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. నిజానికి అనుమతుల వ్యవహారాలన్నీ కన్సల్టెన్సీలతో చక్కబెట్టిన కొందరు అధికారులు, తీరా అనుమతులు ఇచ్చి జేబులు నింపుకోవడంతోనే ఈ పరిస్థితులు తలెత్తినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అసలు కారకులపై చర్యలు తీసుకుంటే గానీ, హెచ్ఎండీఏ రెగ్యులర్ ఉద్యోగులకు వేధింపులు తప్పేలా లేవని వాపోతున్నారు.

## కారుకు వంద.. ఇదేం దందా?

**నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ వసూలు**




సిటీబ్యూరో, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): నవ్విపోదురు గాక నాకేంటీ అన్న చందంగా బుద్ధ పూర్ణిమ ప్రాజెక్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. సామాన్యుడి నడ్డి విరిచేలా దళారులు పార్కింగ్ ఫీజు ముక్కు పిండి వసూలు చేస్తున్న పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలో హెచ్ఎండీఏ నిర్వహించే పార్కింగ్ ఫెసిలిటీ కోసం వాహనదారుల నుంచి రెండింతలు పార్కింగ్ ఫీజు వసూలు చేసి హెచ్ఎండీఏ ఖజానాకు గండికొడుతున్నా.. అధికారులు స్పందించడం లేదు. అందిన కాడికి వాహనదారుల నుంచి వసూలు చేస్తూ... తిలా పాపం తలా పిడికెడు మాదిరి పంచుకున్నట్లుగా ట్యాంక్ బండ్ పార్కింగ్ దందా యథేచ్ఛగా సాగుతుంది. ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఇద్దరు అధికారుల ప్రమేయమే దళారీ రెండింతలు పార్కింగ్ ఫీజు వసూలు చేయడానికి ప్రధాన కారణమని, దిక్కు ఉన్న చోట చెప్పుకోమంటూ వాహనదారులపై విరుచుకుపడుతుండటం కొసమెరుపు.

అసలే గణపతి నవరాత్రులు, అందులో ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవం. ఇక వీకెండ్ వచ్చిందంటే ట్యాంక్ బండ్ పరిసరాలు సందడిగా మారుతుంటాయి. గణేశ్ ఉత్సవాల ప్రారంభం నుంచే ఈ ప్రాంతంలో వాహనాల తాకిడి భారీగా పెరిగితే... ఇప్పుడు పార్కింగ్ కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తోంది. ట్యాంక్ బండ్‌పై హెచ్ఎండీఏ అధికారుల సహకారంతో యథేచ్ఛగా రెండింతలు వసూలు చేస్తూ.. ఖజానా ఖాళీ చేయడంలో దళారీకి అధికారులు సహకరిస్తున్నారు. నిబంధనల ప్రకారం టూ, త్రీ వీలర్‌కు రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేయాల్సి ఉండగా.. కారుకు రూ.100 చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇక బైకులు, ఆటోలకు రూ. 50 నుంచి 70 చొప్పున లాగేస్తుండగా అడిగే వారు లేకుండా పోయారు.






**కమిషనర్ చెప్పాడంటూ.. బీపీపీ అధికారుల బుకాయింపు**

అధిక పార్కింగ్ ఫీజుల వసూళ్లపై సంబంధిత అధికారుల వివరణ కోరగా.. హెచ్ఎండీఏ కమిషనర్ డబుల్ చార్జీలు వసూలు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారేమో అంటూ బీపీపీ అధికారులు బుకాయించారు. దీనిపై నమస్తే తెలంగాణ.. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను వివరణ కోరే ప్రయత్నం చేయగా.. కనీసం స్పందించలేదు. ఓ వాహనదారుడి నుంచి కారుకు రూ.100 చొప్పున వసూలు చేసిన బిల్లింగ్‌తో అందించినా.. అసలు దీనిపై సమాచారమే లేదన్నట్లు వ్యవహరించారు. బీపీపీ అధికారులు దీనిపై మాట్లాడేందుకు పెదవి విరిచారు. టెండర్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు బీపీపీ, హెచ్ఎండీఏ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకూడదనే మౌఖిక ఆదేశాలు కూడా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రసీదుపై అధికారికంగా వసూలు చేయడం వెనుక.. పార్కింగ్ ధరలు ఎందుకు పెంచి వసూలు చేస్తున్నారన్న సందేహాలు ఉన్నాయి. దళారీకి లబ్ధి చేకూర్చేలా బీపీపీ అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అడ్డగోలుగా రెండింతల ఫీజు వసూలు చేయడం వెనుక దళారీ, బీపీపీ అధికారులు ప్రమేయం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.